# సాంఘికపోరాట విస్మరణలో దళితులు

**దళిత ఉద్యమం కమ్యూనిస్టులకు ఎంత నేర్పిందో ఏం నేర్పిందో గానీ, రాజ్యాధికారం అన్ని సమస్యల పరిష్కారానికి నాంది అన్న అభిప్రాయాన్ని కమ్యూనిస్టుల నుండి తాను స్వీకరించి నష్టపోయింది.**



మరొక్క జూలై 17 వచ్చింది, పోయింది. ఈ రాష్ట్రంలోని రాజకీయ జీవులకళ్లు తెరిపించిన రోజుగా ఆ తేదీకి ఉన్న ప్రాముఖ్యాన్ని అందరూ మరిచిపోయారు అన్నంత నిశ్శబ్దంగా గడిచిపోయింది.

తేదీని మరచిపోగలరేమో గానీ ఆ తేదీ తమ మీద వేసిన ముద్రను ఎవరూ మరచిపోలేరు. అది మన రాష్ట్రంలోని సకల రాజకీయ ఉద్యమాల నడకను మార్చివేసిన సంగతి ఎవరూ మరచిపోలేరు.

కానీ ఎంత ఉద్వేగ్తన జూలై 17 మనల్ని రాజకీయంగా కుదిపేసిందో అంత సులువైన మార్పులను తేలేకపోయింది. దానికెన్నో కారణాలున్నాయి గానీ 'మానవ వైఫల్యం' ప్రధానమని క్లుప్తంగా చెప్పుకుంటే సరిపోతుందేమో. ఆ వైఫల్యమే లేకుంటే ఆనాడు కారంచేడులో చనిపోయిన ఆరుగురి మరణం మరింత సార్థకం అయి ఉండేదేమో.

ఆ మాట అనుకొని పెద్దగా ప్రయోజనం లేదు. సంపూర్ణమైన సార్థకత, వైఫల్యం ఎరుగని కృషి, మనుషులకూ మానవ వ్యవహారాలకూ సాధ్యంకావు. మనుషులు సృష్టించుకున్న దేవుళ్లకు మాత్రమే సాధ్యమవుతాయి.

అందుకోసమే మనుషులు దేవుళ్లను భావించుకున్నారు. తమకు సాధ్యం కాని సంపూర్ణతనూ సమగ్రతనూ ఆపాదించి తమ సృష్టికి తామే భయపడి —తామే ఆరాధకులయి, తామే సేవకులయి —బతకసాగారు. తమలోని వెలితికీ అపరిపూర్ణతకు అతీతమైన ఆ దేవుళ్లు మనుషుల ఉనికికి ముఖ్యమయిపోయారంటే ఆ దేవుళ్లను చేతిలో పెట్టుకున్న పూజారులు అన్ని సంస్కృతులలోనూ మొదటి పెత్తందార్లు. దేవుళ్ల సంగతేమోగానీ పూజార్లకు భయపడి బతికిన సుదీర్ఘమైన చరిత్ర మానవజాతికి అన్ని ప్రాంతాలలోనూ ఉంది.

ఈ పూజార్ల పెత్తనం కేవలం భౌతిక పెత్తనంకాదు. చాలా సందర్భాలలో భౌతిక పెత్తనం అందులోని అత్యల్పమైన అంశం మాత్రమే. అది మనుషుల మెదళ్ల మీద, వ్యక్తిత్వం మీద, 'నేను' అనే ప్రాథమిక అస్తిత్వ మూలం మీద నెలకొల్పిన పెత్తనం. అది 'నా దగ్గర ఎంత ఉందనే' విషయాన్ని కాక 'నేనెవరిని' అనే విషయాన్ని శాసించింది. మనిషికి ప్రకృతిని కాకుండా చేయడం కాదు, మనిషికి తననే కాకుండా చేసింది.

పూజారి తనానికుండే ఈ దుర్మార్గమైన లక్షణాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసి అత్యంతబలంగా వ్యవస్థితం చేసింది భారతదేశంలోని బ్రాహ్మణీయ వ్యవస్థ. అది మనుషుల మెదళ్లనూ వ్యక్తిత్వాలనూ ఎంత పూర్తిగా లోబరచుకుందంటే ఆ వాస్తవానికి రాజకీయంగా గుర్తింపు రావడానికి కారంచేడులో ఆరుగురు దళితులు ఘోరంగా చావవలసి వచ్చింది. అంతకు ముందు అదెవరికీ తెలియదనలేదని కాదు. కానీ అత్యధికులు ఒప్పుకోలేదు. అన్యాయంగా చనిపోయిన వాళ్లను, ఉద్యమాలలో చనిపోయినవాళ్లను చాలా సులభంగా 'అమరులు' అంటుంటారు గానీ ఇతరులకు ప్రాణంపోసే చావే 'అమరత్వానికి' అర్హతగల చావయినట్టయితే మనందరి ఆలోచనలకు ప్రాణంపోసిన ఆ ఆరుగురే నిజమైన అమరులు.

కొత్తగా ప్రాణం పోసుకున్న ఈ ఆలోచనలు 1985 జూలై 17 తరువాత చాలా పాయలలోకి చాలా ఉత్సాహంగా ప్రవహించాయి. అన్నిరకాల రాజకీయ ఆలోచనలను తిరగరాసి అభ్యుదయకాంక్షకు ఎన్నడూ లేని బలం చేకూర్చబోతాయనుకున్న తరుణంలో 'మానవవైఫల్యం' అడ్డమొచ్చింది. వచ్చిన ప్రయోజనం తక్కువేమీకాదు గానీ ఊహించినంతరాలేదు. మనం దేవుళ్లమూ కాలేము. రాజకీయ దేవుళ్లమూ కాలేము. దేవుళ్లు కాలేని మనుషులు రాజకీయదేవుళ్లు కాగలరని భావించడం ఆధునిక రాజకీయాల తార్కిక వైపరీత్యాలలో ఒకటి. దానివల్ల జరిగిన నష్టం చాలును కాబట్టి ఇంతమార్పే గొప్ప అనుకోవడం సబబుగా ఉంటుందేమో.

రాజకీయాలలో వచ్చిన ఈ మార్పు



చెరగని ముద్రవేసింది. కానీ సామాజిక పరిణామం ఇంకా చాలా వెనుకబడి ఉంది. ఈరోజు దళిత జనోద్ధరణ అనే విభూతి నుదుట రాసుకోని వారు ఎవరూ లేరు. కానీ జరుగుతున్న ఉద్ధరణకూ ఈ వేషధారణకూ పెద్దగా పొంతనలేదు.

పెద్ద పెద్ద మేధావులు పెద్ద పెద్ద ఉపన్యాసాలూ ఇచ్చే విశ్వవిద్యాలయాలలోకి దళితులు ఆదివాసీల ప్రవేశం 'బ్యాక్‌లాగ్' అని పిలువబడే అనంతమైన 'హర్డిల్స్' మీదుగా జరిగే కష్టసాధ్యమైన దూకుడు పందెం. ఆ 'హర్డిల్స్' ఒకచోట స్థిరంగానూ ఉండవు. వాటిని వెనక్కీ ముందుకూ ఈ పక్కకూ ఆ పక్కకూ జరుపుతూ ఉంటారు. ఏదో ఒకరోజు తీసి చంకలో పెట్టుకొని వెళ్లిపోతారు. ఆశతో పందెంలోకి దిగిన అమాయకులకు పందెం ఎక్కడో తెలీదు.

కులం పేరు పెట్టి నీచంగా తిడితే కొడితే హింసిస్తే మొరపెట్టుకోవడానికికొక గట్టి చట్టం ఉంది కదా అనుకొని పోలీస్‌స్టేషన్ను వెతుక్కుంటూపోయిన వాళ్లకు తాము చేస్తున్నది తప్పుడు అభియోగమన్న సందేహానికి ముందు సంజాయిషీ చెప్పుకోవలసి ఉంటుందనీ ఆ అవాంతరం గడిచినట్టయితేనే తమకు అన్యాయం చేసిన వారి మీదికి 'చట్టం' చూపులు పోతాయనీ త్వరలోనే అర్థం అవుతుంది. (అన్ని చట్టాలూ ఏదో ఒక మేరకు దుర్వినియోగం అవుతూనే ఉంటాయి గానీ దళితులు, స్త్రీలు, ఆదివాసీలకు హక్కులు కల్పించే చట్టాల గురించి మాట్లాడేటప్పుడు మాత్రమే అందరూ దుర్వినియోగమే ప్రధానమయినట్టు మాట్లాడతారు.)

దళితులకు ఇళ్లపట్టాలనీ ఇళ్లకాలనీలనీ ఉచిత హాస్టళ్లనీ స్కాలర్‌షిప్పులనీ అత్యాచారాలకు గురయితే నష్టపరిహారమనీ ఆశపడి ముందు కురికిన వాళ్లకు ఏమీ దక్కదని కాదు గానీ అడుగడుగునా చిల్లర మల్లర అవాంతరాలూ అవమానమూ అనాసక్తీ ఎదుర్కోవాలి, అడుగడుగునా 'నువ్వు అడుక్కునేవాడివి సుమా' అనే అనుమానాన్ని ఎదుర్కోవాలి. అన్నీ వీళ్లకే ఇచ్చేస్తున్నారు అనే అర్థరహితమైన నిరసనను ఇతరులనుండి ఎదుర్కోవాలి. చట్టం దళితులకు ఇచ్చింది ఎంతోగానీ అంతకు పదిరెట్ల నిరసన బ్రాహ్మణీయ ఆలోచనారీతులకు బందీలయిన మనసులలో పెల్లుబికింది. ఇది దళితుల ఆత్మగౌరవంపైన నిత్యం పడే సమ్మెటపోటు. పుండు మీద కారమన్నట్లు, దీన్ని కారణంగా చూపించి మీరు ప్రత్యేక హక్కును కోరకుండా ఉండడం మీకే మంచిదీ అని దళితులకు ఉద్బోధ చేసే ప్రబుద్ధులూ లేకపోలేదు. రిజర్వేషన్ల గురించి చర్చ జరిగినప్పుడు ఈ డొంక తిరుగుడు వాదనతో రిజర్వేషన్లను వ్యతిరేకించే మేధావులు చాలామందిని చూసాం. చేసే ఉద్బోధ ఏదో నిష్కారణంగానూ అన్యాయంగానూ పీడితుల హక్కుల పట్ల నిరసన పెంచుకున్న వారికి ఎందుకు చేయాలో అర్థంకాదు.

మనుషులు సృష్టించిన దేవుళ్లను తమ చేతిలోకి తీసుకొని మనుషుల మెదళ్లమీద, వ్యక్తిత్వాల మీద పెత్తనం నెలకొల్పిన పూజార్ల ఆధిపత్యాన్ని ఎక్కడా లేనంత సంపూర్ణంగా అభివృద్ధి చేసిన ఈ దేశంలో ఆలోచనలనూ వ్యక్తిత్వాలనూ గెలుచుకునే తాత్విక సాంస్కృతిక పోరాటం అతి ముఖ్యమైన పోరాటమన్న సత్యాన్ని జూలై 17 మరింత సంపూర్ణంగా నేర్పించవలసి ఉండింది.

కానీ దళిత ఉద్యమం కమ్యూనిస్టులకు ఎంత నేర్పిందో ఏం నేర్పిందో గానీ, రాజ్యాధికారం అన్ని సమస్యల పరిష్కారానికి నాంది అన్న అభిప్రాయాన్ని కమ్యూనిస్టుల నుండి తాను స్వీకరించి నష్టపోయింది. దళిత ఉద్యమకారులు ఈ అభిప్రాయాన్ని అంబేద్కర్‌కు ఆపాదిస్తున్నారు కానీ, ఆయన దళితులు రాజ్యాధికారం చలాయించాలని చెప్పినప్పటికీ అదే ఆయన ఆలోచనలకు కేంద్రం కాదు. అంబేద్కర్, పెరియార్, పూలేలు ముగ్గురు రాజకీయ మార్పుల కంటే సాంఘిక మార్పుకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. ఆ దిశగా ఆలోచనలను అభివృద్ధి చేసేబదులు రాజ్యాధికారం అన్న భావనకు పెద్దపీట వేసి దానికి అనుగుణమైన వ్యూహాల, ఎత్తుగడల వేటలో దళిత ఉద్యమం పడింది. దానివల్ల నిజంగా కొత్తవయిన పోరాట రూపాలను సహితం దళిత ఉద్యమం ఆవిష్కరించలేకపోయింది.

ప్రభుత్వం మీద డిమాండ్లు పెట్టడం అత్యంత సహజమైన ఆందోళనా మార్గంగా మనకుతోస్తుంది. ఇప్పటిదాకా అన్నిటికంటే బలమైన ఉద్యమ సంప్రదాయంగా ఉన్న కమ్యూనిస్టు సంప్రదాయం ప్రభావం దీనికి కారణం కావచ్చు. కానీ కులనిర్మూలన జరగాలంటే ప్రభుత్వం మీద డిమాండ్లు పెట్టడంకంటే సామాజిక వ్యవస్థలో, అలవాట్లలో ఆలోచనారీతులలో మార్పు కోసం కృషి చేయడం ఎక్కువ అవసరం. కారంచేడు జరిగిన తరువాత 15 ఏళ్లకు సహితం ఈ కృషికి అవసరమైన కార్యాచరణ రూపాలను దళిత ఉద్యమం ఆవిష్కరించలేకపోవడం ఆ ఉద్యమ వైఫల్యాలలో అతి ముఖ్యమైనది.

అధికారం మనుషులను అయస్కాంతంలా ఆకర్షిస్తుంది. అధికారం ఉన్నవాళ్ల చుట్టూ తిరుగుతుంటారు. అధికారం కోసం జరిగే పోరాటంవైపు ఆకర్షితులవుతారు. ఆ పోరాటాలు పురోగమించే క్రమంలో ఎక్కడికక్కడ స్థానికంగా నెలకొల్పే అధికారం చుట్టూ కూడా తిరుగుతుంటారు. అందువల్ల అధికారం కోసం అధికారానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలు చాలా సహజమైనవిగా కనిపిస్తాయి. వాటికి సంబంధించిన పద్ధతులు, వ్యూహాలు, ఎత్తుగడలు సులభంగా ఆవిష్కరించబడతాయి. వేరేరకం రాజకీయ కృషి ఉండగలదన్న ఆలోచనే విచిత్రంగా అనిపిస్తుంది. మన దగ్గర కమ్యూనిస్టులూ దళిత ఉద్యమకారులూ ఇద్దరూ కూడా అధికారం కోసం అధికారానికి వ్యతిరేకంగా పోరాటం చేసే వ్యూహాన్నే ఎంచుకోవడంవలన రాజకీయం అంటే ఒకే ఒకరకంగా ఉంటుందన్న అభిప్రాయం స్థిరపడింది.

కానీ రాజ్యానికీ దాని అధికారానికీ వ్యతిరేకంగా పోరాటాలు చేసి దళితులు సాధించుకున్న హక్కుల అమలులో ఎదుర్కొంటున్న సమస్యలనూ ఆటంకాలనూ పరిశీలిస్తే, వాటికి మూలం రాజకీయ అధికారంలో కన్నా సమాజంలోనూ సమాజంలో మూలంగా ఉన్న బ్రాహ్మణీయ సామాజిక వ్యవస్థలోనూ సంస్కృతీ ఆలోచనా రీతులలోనూ ఉందని అర్థం అవుతుంది. ఇవి చాలాకాలంగా వేళ్లూనుకొని ఉన్నాయి. రాజ్యాధికారం లేక రాజకీయ అధికారం ద్వారా వీటిని ఎదుర్కొనడానికి చేయగలిగింది కొంత ఉందేమో గానీ అది కొంతే. ఈ పోరాటం ప్రధానంగా సమాజంలో జరగవలసి ఉంది. దానికి తగిన పోరాటరూపాలు, ప్రచారరూపాలు ఇంకా తయారు చేసుకోవలసి ఉంది. సమాజంలో ఎస్‌సి, ఎస్‌టి, ఓసిప్రజానీకం జనాభా ఎంత ఉందో లెక్కలు గట్టి వారి వోట్లన్నీ కలిసిన నాడు తమదే రాజ్యాధికారం అని ఎదురు చూసే దిశగా దళిత ఉద్యమాన్ని —ఒకరకంగా చెప్పాలంటే కమ్యూనిస్టు నమూనాలో —తీసుకునిపోతున్న దళిత నాయకులు ఈ కృషిని పూర్తిగా విస్మరిస్తున్నారు. వారు అంబేద్కర్, పెరియార్, పూలెల రచనలను మరొకసారి లోతుగా అధ్యయనం చేస్తే మంచిదేమో.

— కె.బాలగోపాల్